

# ఆంతర్యాలూ అనుబంధాలూ

కొండముది భానుమతీరావు

అన్న పెండ్లి చేసుకోవాలని, సుఖ పడాలని కోరుకోని చెల్లెలు ఉండదు. అంతా అయ్యాక అమూల్యమైనది ఏదో కోల్పోయినట్లుగా చింతించని చెల్లెలూ ఉండదు. ఎంతటి చిన్న సంఘటన అయినా చాలు దానిని కెలికి బాధించ డానికి. ఆ వేదనా మాధుర్యం అనుభ వైక వేద్యం.

సంధ్య — ఇలా జరుగుతుందని — ఎన్నడూ అనుకోలేదు.

ప్రకాశం, రాధ మేడమెట్లు దిగుతూంటే తన గుండెలు మోయలేని, బరువు నెత్తుకుంటు న్నాయి. వారిద్దరూ వీధిలో సాధ్యమైనంత దగ్గ రగా నడుస్తూ పోతూంటే ప్రకాశానికీ తనకూ ఉన్న సంబంధం, రాధతోటి స్నేహం దూరమయి పోతూన్న భావన కలుగుతూంది.

సంధ్య వీరి నయనాలు అశ్రుసిక్తాలయాయి.

ప్రకాశం, రాధ వీధి మలుపులో రిక్షా ఎక్కి వెళ్లిపోయారు.

వారిద్దరూ దృష్టిపథంలో నుంచి తప్పుకు పోయినా వారి రూపాలు సంధ్య మనోపథంలో పీఠం వేసుకుని కూర్చునే ఉన్నాయి.

ఇలా జరుగుతుందని — సంధ్య ఎన్నడూ అనుకోలేదు.

ఈ సాయంత్రం జరిగిన సంఘటన తలుచు కొన్నకొద్దీ దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవ హిస్తున్నది.

ఈ రోజు రాత్రికి గ్రాండ్‌ట్రంక్ ఎక్స్ ప్రెస్‌లో ఢిల్లీ నుంచి మామయ్య వస్తున్నాడు. కాబట్టి తనెటూ సినిమాకు పోదలచుకోలేదు. తనంటే మామయ్యకు చెప్పలేనంత ఆపేక్ష— అంచేత మామయ్య వచ్చేవేళకు ఇంట్లో లేకుండా ఏ సినిమాకో పోవటం ఇష్టంలేదు. అన్నయ్య రమ్మన్నా తనామాటే చెప్పదలుచుకుంది. కాని

ఎటొచ్చీ రాధ బలవంతంచేస్తే — బలవంతం చేసే కారణం ఉంది కాబట్టి — పోనీ వెళ్దాము అనుకుంది.

తను, రాధ ఈ పెళ్లికాని ముందు —అంటే నెల రోజుల క్రితం సినిమాకు పోయిన రోజున ఈ కొత్త సినిమా వస్తుందన్న స్లయిడ్ చూసి నపుడు తప్పక చూడాలని అనుకున్నా రిద్దరూ— ఆ చిత్రం అంటే తమిద్దరికీ ఎనలేని అభిమాన మవటాన. అప్పటికింకా ఈ సంబంధం నిశ్చయం కూడా కాలేదు. ఇప్పుడు కేవలం స్నేహమే కాదు. సంబంధం కూడా కలిసింది. రాధ తనకు వదిన ; ప్రకాశం అన్నయ్య భార్య.

అలాంటప్పుడు సినిమాకు రమ్మని బలవంతం చేయకుండా ఉంటుందని ఎలా అనుకుంటుంది ? బలవంతం కాదు కదా, మాటమాత్రమయినా అవలేదు. ఇలా ఎందుకు మారిపోయింది రాధ ? తనేమయినా తప్పు చేసిందా ? మనసు కష్టపెట్టు కునే మాటేమయినా అన్నదా తను ?

తనకు తెలిసినంతవరకు అలాంటిదేమీ జరగ లేదు.

ఇంత నిరసన, కృతఘ్నత ఎందుకు మరి ?

సంధ్య కళ్లు నీటి కుండలయ్యాయి. దుర్బల హృదయం దు:ఖానికి తట్టుకోలేకపోతున్నది. ప్రకాశం ప్రేమాభిమానమూ, రాధ స్నేహాను బంధమూ పొట్టపెట్టుకుంటున్నందుకు సున్నిత మయిన సంధ్య మనసు శతవిధాలా బాధపడు తూంది.

ప్రకాశం ప్రేమైకమూర్తి, రాధ రాగాల వీణ అయితే అన్నయ్య అపరంజి బొమ్మ, వదిన వరాల మూట అనుకుంది !

కాని, కాని — ప్రకాశం, రాధ అదే— అన్నయ్యా,వదినా ఇలా ఎందుకు మారిపోయారు వివాహమయ్యాక !

అన్నయ్య ఎంత ప్రేమగా చూసేవాడు తనను ? తనంటే అన్నయ్య కెంత ఆపేక్షో ఎలా చెప్పగలదు !

వాల్తేరులో ఎమ్. ఎస్‌సి. చదువుతూండగా ఎన్నో బహుమతులు తెచ్చిపెట్టుతూండేవాడు. తన మనసులోని కోరిక ఎలా గ్రహించాడో మరి— షైవలియర్‌లో ఉండగా రాధాకృష్ణులవిగ్రహం-- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ది—తెచ్చి ఇచ్చాడు.

తన మీద ఒక్క ఆపేక్షే కాదు, తన భవి ష్యత్తుమీద ఎంతో శ్రద్ధ కూడాను !

తను పెద్దమనిషి కాగానే అమ్మా నాన్నగారూ చదువు మాన్పిస్తామంటే అన్నయ్య పోట్లాడి— పోట్లాడటమేమిటి, ఒక రోజు నిరాహారదీక్ష పూని — తనను స్కూలుకు పంపించేటట్లు చేశాడు.

ఆ తర్వాత మాత్రం? ఎమ్.ఎస్‌సి. ప్యాసయి లెక్చరరుగా పని చేస్తున్న ఈ ఏడాదిలోను ఎంత ప్రేమగా చూశాడు ! కొత్త సినిమా వస్తే తనను తప్పక తీసుకెళ్లేవాడు.ఎక్కడ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారన్నా, కల్చరల్ ప్రోగ్రాం జరుగుతుందన్నా

# అంతర్యాలా, అనుబంధాలా

తనను వెంటబెట్టుకు వెళ్లేవాడు.

అలాంటి అన్నయ్య ఈ రోజు ఇలా మారి పోయాడంటే ఎంతో ఆవేదనగా ఉంది. అమ్మా నాన్నగారూ చదువు మాన్పించి ఇంట్లో కూర్చో పెడతామన్న రోజునయినా ఇంత ఆందోళన, ఇంత ఆవేదన అనుభవించలేదు. తన జీవితానికి పెద్ద చదువులు చదివే యోగ్యత లేదు కాబోలు— అని సరిపెట్టుకో ప్రయత్నించింది కాని.

ఈ రోజు తను తెలిసో తెలియకో తప్పుగా ప్రవర్తిస్తే, "అమ్మడూ! అలా అనకూడదనో", లేదా "ఇలా చేయకూడదు" అనో సరిదిద్ద వచ్చునే ! లేదా దండించినా సంతోషంగా అనుభ వించేదే !—ఇలా మూగ బాధ అనుభవించమనే కంటే, మొహంమీద అవమానించే కంటే.

పోనీ అన్నయ్య మగవాడు క్షమా గుణం కొంచెం తక్కువనుకుందాం. ఆడకూతురు రాధ కూడా తప్పు చెప్పకుండా ఇంత పెద్ద శిక్ష విధి స్తుందా ? తప్పేమిటో కూడా తెలుసుకోకూడ నంతని నేరమేమయినా చేసిందా తను ?

"నీ ఋణం ఎలా తీర్చుకుంటావో సంధ్యా."

—సంబంధం నిశ్చయమయి తాంబూలాలు పుచ్చుకొన్న రోజున సంధ్యవేళ వాళ్లింటికి పోతే డాబామీద రాధ అన్న మాటలకూ, ఈనాటి ప్రవర్తనకూ ఎంత భేదం ?

"ఇందులో తీర్చుకోవాల్సిన ఋణమేముంది రాధా ! మీ ఇద్దరికీ రాసిపెట్టి ఉంది. అయింది" అన్నది తను.

అలా అన్నదేకాని అందరితోపాటు తనకూ తెలుసును ! దైవేచ్ఛ ఉన్నా మానవ యత్నం తన మూలంగా జరిగిందని !

అన్నయ్య వివాహం ఒక సమస్యగానే తయా రయింది ! అందరూ ఆడపిల్ల పెళ్లి ఈ రోజుల్లో సమస్య అనుకుంటారు గాని మగవాళ్ల వివాహం కూడా సమస్యే అవుతున్నది.

అన్నయ్య వాల్తేరులో ఆనర్స్ చదువుతూండ గానే సంబంధాలు రావటం మొదలెట్టాయి. అమ్మా, నాన్నగారూ పెళ్లి చేసేయాలనే చూశారు. కాని అన్నయ్యమాత్రం చదువు పూర్తికానిదే చేసుకో నన్నాడు. సరే! అలాగేలే— అని ఊరుకున్నారు. చదువయిన తర్వాత "ఇప్పు

> *తెలివిగా ముందే మేల్కొని సరళత్వాన్ని ఆశ్రయించకపోతే మనం పశుప్రవృత్తికన్న హీన మైన స్థితికి దిగజారక తప్పదు.*
>
> —గాంధీజీ

డయినా చేసుకుంటావా" అంటే, "ఉద్యోగంలో చేరి నా కాళ్లమీద నన్ను నిలబడనీయండి. చేసు కుంటాను" అన్నాడు. అప్పుడూ ఊరుకున్నారు అమ్మా, నాన్నగారూ ! కాలేజీలో లెక్చరరుగా చేరాడు. "ఇకనయినా ఒక ఇంటివాడివవుతావా?" అంటే, "ఊ" అన్నాడు ఆఖరికి.

ఈ ఏడాదిలో సుమారు పదిహేనుమంది పిల్లల్ని చూశాడు. ఒక్కరూ నచ్చరు. అమ్మకూ, నాన్నగారికీ ఓపికపోతున్నది. ఆడపిల్లల తండ్రు లకు సమాధానం చెప్పలేక సతమతమయి పోతు న్నారు.

"పోనీ నీ ఇష్టమయిన పిల్లను ఏరుకో. చేస్తాం" అంటారు అమ్మా, నాన్నగారూ.

"ఇదేమయినా కూరగాయలా ? మార్కె ట్టులో ఏరుకురావటానికి" అంటాడు అన్నయ్య.

"అంత పెద్ద కాలేజీ ఉంది. అందులో నీకు నచ్చే పిల్ల ఒక్కతే లేదా ?" అంటారు.

ఎవ్వరూ నచ్చరు అన్నయ్యకు. ఎలాంటి పిల్లయితే నచ్చుతుందో చెప్పరా — అంటే చెప్పడు. అమ్మకూ, నాన్నగారికీ అన్నయ్య వివాహం ఒక సమస్యయి పోయింది.

"అమ్మడూ ! నువ్వయినా కనుక్కోవే ! చెప్తాడేమో" అంటుంది అమ్మ.

అన్నయ్య ఊహాసుందరి గురించి విన్నాక తనకు భయమే కలిగింది! అలాంటి అమ్మాయి ఎక్కడయినా దొరికి అన్నయ్యకు వివాహ మవు తుందా అని అనుమానమే కలిగింది !

అన్నయ్య చామనచాయ కాబట్టి —కాబోయే భార్య ఒక ఛాయ తనకన్నా ఎక్కువ ఉండాలి. ముక్కు కొంచెం కొసన కొనతేలి పైకి చూస్తూ ఉండాలి; మొహమేమో అటు గుండ్రమూ, ఇటు కోలగానూ కాకుండా మధ్యరకంగా ఉండాలి. అవయవాల వంపు సొంపులు కొంచెం అటూ ఇటూగా అజంతా సుందరిని పోలి ఉండాలి. ఇక చదువు విషయానికి వస్తే కనీసం స్కూల్ ఫైనల్ ప్యాసయి ఉండాలి; పై హద్దులో డిగ్రీ క్లాసు చదువుతూండవచ్చుగాని డిగ్రీ వచ్చిఉండ కూడదు. డిగ్రీ ఉంటే ఉద్యోగం చేయాలని ఉబలాటపడవచ్చు. ఇల్లూ, ఉద్యోగమూ చూసు కోవటం కష్టమవుతుంది. తర్వాత వయసు విషయంలో పెద్ద సిద్ధాంతమే ఉంది. కాబోయే భార్య వయసు పదహారుకు తక్కువ కాకూడదు. (అంటే అర్థమున్నది-అన్నయ్య వయసు ఇరవై పైనే కాబట్టి). పంధొమ్మిదికి మించకూడదు— మరో విధంగా చెప్పాలంటే "టీన్ యేజ్" దాట కూడదు. సామాన్యంగా మగపిల్లవాడు ఇరవై, ఇరవై ఒకట; ఆడపిల్ల 17, 18 సంవత్సరాల వయసు వచ్చేసరికి కాబోయే జీవిత భాగస్వామి— ఎలా ఉండాలో నిశ్చయించుకొంటారు. తమ ఊహకు సరిఅయినవారు లభించకపోతే వైవా హిక జీవితం ఒడుదుడుకులు లేకుండా గడవటం కష్టం. తన వయసు ఇరవైమూడు కాబట్టి

తనొక మందరిని ఊహించుకున్నాడు. అలాగే తనకు కాబోయే భార్య పంథొమ్మిది దాటినదయితే ఒక ఊహామూర్తిని ఆరాధిస్తూ ఉంటుంది. ఇద్దరి ఊహామూర్తులూ కలవకపోయినా జీవితంతో రాజీపడి వివాహం చేసుకుంటే సుఖంగా కాలం గడవదు.

అమ్మా, నాన్నగారూ ఈ విషయం తన నుంచి తెలుసుకుని కుప్పకూలిపోయారు. చిన్నప్పుడే— అంటే కనీసం కాలేజీలో చేరకముందే —అన్నయ్య పెళ్లి చేయకపోవటం తమదే తప్పని చెంపలు వాయించుకున్నారు. చిన్న వయసులో అయినట్లయితే తమకు నచ్చిన పిల్లను చూసి చేస్తే కాదనే వాడు కాదు.

అమ్మా, నాన్నగారూ అలా నొచ్చుకుంటూనే ఉన్నారు — ఎదురింట్లోకి పొద్దున కొత్తగా దిగిన వారి అమ్మాయి గుమ్మంలోకి వచ్చి నిల్చుంది.

పదహారు, పదిహేడేళ్ల వయసు — పచ్చని శరీరం. వాయిల్ చీర, వదులు వదులుగా, దువ్విన నల్లని వెంట్రుకలు. మొహాన నిండుగా కుంకుమ బొట్టు. చదువుతూ చదువుతూ వచ్చిందేమో తెరిచిన పత్రిక చేతిలో—

ఎక్కడో ఇదివరలో చూసినట్లుగా, మాట్లాడినట్లుగా తోచింది. ఎంతో ఆత్మీయురాలు, జన్మ జన్మల సంబంధమేదో ఉన్నట్లు భావన కలుగుతూంది.

మాట్లాడించకుండా ఉండలేకపోయింది.

"మీరేనా కొత్తగా వచ్చింది ?"

—ఆ అమ్మాయి అప్పటికే ఇంట్లోకి పోయింది.

పరిచయం చేసుకోవాలని మనసు తహ తహ లాడుతుంది. ఇంటికి పోవాలంటే పిలవని పేరంటమవుతుందన్న శంక.

రాత్రి మంచంమీద పడుకున్నదే కాని నిద్ర పట్టలేదు.

తెల్లవారిన తర్వాత — ఆ అమ్మాయి ఏమనుకున్నా అనుకోనీ — వాళ్లింటికిపోయి పరిచయం చేసుకోవాలని నిర్ణయించుకుంది.

ఎనిమిదిగంటలకల్లా నీళ్లు పోసుకుని చీర కట్టుకుని తయారయింది. కాని వచ్చీ పోయే మగవాళ్లకు అంతులేదు — వాళ్ల నాన్నగారికేమి ఉద్యోగమో కాని.

పదిగంటలయినా తనకు వీలు కాలేదు. కాలేజీ వేళయింది. భోజనంచేసి కాలేజీకి పోయేసరికి ఫిజిక్సు క్లాసు జరుగుతూంది. క్లాసు మధ్యలో వెళ్తే మగపిల్లల కళ్లన్నీ తనమీదే ఉంటాయి. ఒళ్లంతా ముళ్లు గుచ్చుకున్నట్లే ఉంటుంది. వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని పుస్తకం తెరిచింది. కాని మనసంతా కొత్తమ్మాయి ఆక్రమించుకుంది!

ఏమిటే విచిత్రం! తన కెంతోమందితో పరిచయముంది, స్నేహముంది. కాని ఈ అమ్మాయి ఇదేమిటా? ప్రథమ వీక్షణంలోనే తన మనసు నాకట్టుకుంది!

ఎవరో వచ్చి కూర్చున్న అలికిడి అయింది.

కన్నెత్తి చూస్తే—తన కళ్లను తాను నమ్మలేకపోయింది. వెతుకుతున్న తీగె కాలికి తగిలింది. ఎదురింట్లో నిన్న దిగిన అమ్మాయి!—కాదు—నిన్న సాయంత్రంనుంచి తన మనసు నాక్రమించుకున్న మగువ!

చేతిలో పదిరకాల పుస్తకాల బరువుగా— కళ్లలో పరిసరాల కొత్తదనం బెరుకుగా— "రండి! రండి!" హృదయపూర్వకంగా ఆహ్వానించింది.

వచ్చి కూర్చున్నదే కాని—తనెవరో ఆ అమ్మాయికి తెలియదు. ఆ మాట చెప్పలేదు. మనసులో మథనపడుతూంది—ఎక్కడ పరిచయమా అని.

"మా ఇల్లు మీ ఇంటి కెదురుగానే లెండి. నిన్న పొద్దునకదూ మీరు వచ్చారు?"

నెత్తిమీద బరువు దించుకున్నట్లు నిట్టూర్పు!

"అవునండి. మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయింది."

ఎంత తీయని కంఠస్వరం!

"ఏ క్లాసు మీరు?"

"పి. యు. సి."

"గ్రూపో?"

తన గ్రూపే! తన ఆనందానికి అవధుల్లేవు!

ఆ అమ్మాయి పేరు రాధ. వాళ్ల నాన్నగారు ఇంజనీరు. ఇద్దరే పిల్లలు. వాళ్ల అన్నయ్య మద్రాసులో ఇంగ్లీషు లిటరేచరులో డాక్టరేటు చేస్తున్నాడు.

ఒక క్వార్టరయింతర్వాత వచ్చి చేరింది కాబట్టి—పోర్షన్లు ఎంతవర కయిందీ చెప్తూనే ఉన్నది. ఫస్టవరయిపోయింది. సెకండవర్ ఇంగ్లీషు. వెంటపెట్టుకుని క్లాసుకు తీసుకెళ్లింది. సాయంత్రం ఇంటికి ఒక రిక్షాలోనే!

రిక్షా దిగి రాధ ఇంట్లోకి పోతూంటే—

"మా ఇంటికి పోదాం రారూ!" అని ఆహ్వానించింది; కాదు అర్థించింది.

"వస్తాను. నీళ్లు పోసుకుని—"

వస్తూ వస్తూ మల్లెలూ, కనకాంబరాలూ బుట్టలో పోసుకొచ్చింది. అమ్మకూ నాన్నగారికీ పరిచయంచేస్తే ఎంతో వినయంగా నమస్కరించింది! అన్నయ్యక్కూడా పరిచయం చేద్దామంటే ఇంట్లో లేదు.

కూర్చునికబుర్లుచెప్తుతూమాలలుకట్టుతున్నది.

వాళ్లది అసలు కాకినాడ. ఏడాదీ రెండేళ్లకోసారి వాళ్ల నాన్నగారికి ట్రాన్స్ఫరవుతూంటుంది. ఒక్కొక్కప్పుడు ఇలా సంవత్సరం మధ్యలో ట్రాన్స్ఫర్ రావడం కూడా ఉంది. అంచేత వాళ్లన్నయ్య మద్రాసులో తనతో పాటు ఉంచుకొని చదివిస్తానంటే అమ్మా, నాన్నగారూ తమకు తోడుండదని ఒప్పుకోలేదు. ఈసారి ఇలా ఒక క్వార్టరయాక ట్రాన్స్ఫరయింది— పాఠాలెలాగో అని భయపడుతూ



"మాకు దక్కుకు లోటులేదు. అయినా మీకు తోచిన ధర్మం..."

చిత్రం— టి. వి. రమణమూర్తి

(అనపర్తి)

వచ్చిందిట. కాని తనను చూసేసరికి ఎంతో ధైర్యం వచ్చింది.

మాట లెంతో నెమ్మది! మరెంతో మధురం!

రెండు పూలమాలలు కట్టి ఒకటి తనకీయబోయింది.

"వద్దండీ! ఇదిగో తలలో ఉంది" అన్నది తను.

"కాదనకండి! ఈరోజు కలిసిన మనస్నేహం ఈ పూలమాలలా పరిమళించాలి."

కన్నె హృదయంలోని కళాత్మక భావానికి తన మనసు ఊగిపోయింది.

కల్లా కపట మెరుగని మనసులో నుంచి వచ్చిన మధురమైన మాటలకు తన హృదయం కరిగిపోయింది!

"చీకటి పడింది! వస్తానండి!"

రాధ లేచి అడుగులు వేస్తూంది.

ఆమెతోపాటు తన మనసును కూడా తీసుకపోతూంది. రాధను విడిచి ఒక్కక్షణం కూడా ఉండలేనేమో ననిపిస్తూంది.

ఏ జన్మదీ అనుబంధం?

ఎలాంటిదీ రాగబంధం ?

తెల్లవారటమే తరువాయి నీళ్లుపోసుకుని జడవేసుకుని వాళ్లింటికి వెళ్లింది తను. రాధ నాన్నగారు పేపరు చదువుకుంటున్నారు. అమ్మ

స్నానం చేస్తూంది. రాధ కూర తరుగుతూంది. తనను చూసి లేచివచ్చి నాన్నగారికి పరిచయం చేసింది.

నలభై అయిదు, ఏభై సంవత్సరాల వయసు. ఎత్తయిన నుదురు. బట్టతల. దబ్బ పండు శరీరఛాయ. రోల్డ్‌గోల్డ్ ఫ్రేము కళ్ల జోడు వెనుక దాగిన విశాలమయిన కళ్లు.

మాటల్లో ఎంతో ఆత్మీయత, ఆప్యాయత!

రాధకు కొంత తండ్రిపోలిక ఉంది.

స్నానంచేసి తల్లి వచ్చింది. పొట్టిగా వచ్చగా ఉంది. నుదుట రూపాయంత కుంకుమబొట్టు. మెళ్లో కాంతులీనుతున్న మంగళసూత్రం. అప్రయత్నంగా చేయెత్తి నమస్కరించింది.

తన విషయం రాధ అప్పటికే చెప్పింది కాబోలు. తృప్తిగా, తెల్లగా పలువరుస కన్పించేలా నవ్వి—"లోపలికి రామ్మా" అని ఆహ్వానించింది.

మాట, మర్యాద రాధ తల్లిదగ్గరే నేర్చుకున్నట్లున్నది.

తల్లితండ్రులు—ముఖ్యంగా ఆడ పిల్లలకు ముఖ్య గురువులన్నమాట నిజమన్నట్లు ఆ క్షణంలో తోచింది తనకు.

పది గంటలకు కాలేజీకిపోతూ తమ ఇంటికి వచ్చింది. అన్నయ్య క్రితంరోజు ఇంట్లో లేకపోవటాన తన కొత్త స్నేహితురాలను, ఆత్మీయురాలిని పరిచయం చేయలేకపోయింది. అది తనకు లోటుగానే ఉంది. అదృష్టవశాత్తూ అన్నయ్య

# అంతర్యాలూ, అనుబంధాలూ

ఈవేళ ఇంట్లోనే ఉన్నాడు.

అన్నయ్యను చూసి రాధ పమిట నిండుగా కప్పుకుని పక్కకు ఒదిగి నిల్చుంది.

అన్నయ్యకు పరిచయంచేసింది. కాని అన్నయ్యతో మాట్లాడటానికి రాధ సిగ్గుపడ్డది.

అన్నయ్యా ఒక్కసారి అలా చూసి—మధ్యాహ్నం లెక్చరుకు ప్రిపేరవుతూండటం మూలానో ఏమో పుస్తకం చదువుకుంటూ ఉండిపోయాడు.

తామిద్దరూ కాలేజీకి వెళ్లిపోయారు.

కాలేజీకి పోవటం, రావటం ఇద్దరూ ఒక రిక్షాలోనే! కాలేజీలో తిరగటం ఇద్దరూ కలిసే! క్లాసులో కూర్చోవటం ఇద్దరూ పక్కపక్కనే. కాలేజీ లేనిరోజున తను రాధ ఇంటికయినా పోతుంది. లేదా రాధయినా తమ ఇంటికి వస్తుంది.

ఆరు నెలలు ఆరురోజులుగా గడిచిపోయాయి.

పరీక్షలయిపోయాయి. రాధకు బహుశా ఫస్ట్‌క్లాసు రావచ్చు. తను ప్యాసవుతుంది—అంతే! సీటు వస్తే రాధకు వైద్యం చదవాలని ఉంది.

సెలవులకు వాళ్ళన్నయ్య మద్రాసు రమ్మని ఉత్తరం వ్రాశాడు.

"రేపు ఉదయం మెయిల్లో వెళ్తానేమో! ఇంటికి పోయి గుడ్డలు సర్దుకుంటాను. ఉత్తరాలు రాస్తూంటావు కదూ—సంధ్యా?"

"ఉత్తరాలు రాస్తానులే. కాసేపు కూర్చో వెళ్ళువుగాని!"

రాధను విడిచి నెలరోజులు ఉండలేదేమో తను—అని భయం కలుగుతూంది.

"ఈ రాత్రికి మా ఇంట్లోనే ఉండి పొమ్మంటా వేమిటే సంధ్యా!"

ఈ ఒక్క రాత్రే ఏమిటి? ఎప్పటికీ ఇక్కడే ఉండిపోతే బాగుండును—కాని అదెలా సాధ్యమవుతుంది? తన నిరాశా హృదయంలో ఒక్క ఆశాకిరణం తళుక్కుమన్నది. అన్నయ్య రాధను పెళ్ళి చేసుకుంటే—

"అదేమిటి? నీలో నీవే నవ్వుతుంటున్నావ్?"

తన మనసులోని మధురభావం ముఖంలో ప్రతిబింబిస్తూంది కాబోలు!

"అవును రాధా! నువ్వెప్పటికీ మా ఇంట్లోనే ఉండిపోవాలి!"

రాధ తన మాటల్లోని భావం అర్థంకాని రాధ—సన్నగా నవ్వింది.

"మా నాన్నగారి సంగతి ఇంకా నీ కర్థమయినట్లు లేదు సంధ్యా! నన్ను వదిలి ఉండలేరు."

ఎంతటి అమాయకత్వం! ఆడపిల్లంటే ఒకరింటికోడలని తెలియదు కాబోలు!

"అయితే నీకు పెళ్ళిచేసి అత్తవారింటికి పంపించకుండా ఇంట్లోనే అట్టే పెట్టుకుంటారా?"

రాధ చెక్కిళ్ళలో ఎర్రని గులాబీలు—కళ్ళలో తెల్లని కాంతులు.

"అదేమో మరి!" మూతి వంకర్లు తిరిగింది.

తనంటే అనుకుంటున్నది గాని రాధకు అసలు అన్నయ్య అంటే ఇష్టమున్నదో లేదో కనుక్కోనవద్దూ—

"రాధా! మా అన్నయ్య గురించి నీ అభిప్రాయ మేమిటి?"

"మీ అన్నయ్య గురించి—నా అభిప్రాయమా?" ఆశ్చర్యమే కనిపించింది ఎదురు ప్రశ్నలో.

"అవును—ఒక బ్రహ్మచారి గుణగణాలను గురించి తెలుసుకోవాలంటే అతన్ని ఎరుగున్న పెళ్ళికాని ఆడపిల్లనే అడగాలి."

లజ్జాభారంతో రాధ కంటిరెప్పలు వాలాయి. బలవంతం చేయటం బాగుండదు.


"పోనీ—మా అన్నయ్య గురించి చెప్పవద్దులే. మీవాళ్ళు నీ పెళ్ళి విషయమై ఏమనుకుంటున్నారు?"

"మా అమ్మ—ఇంకా చదువు లెందుకు?

(తరువాయి 49 వ పేజీలో)






"నానోన్సెయ్! అమ్మకేం, ఇద్దరు పాపాయిలు..."

చిత్రం—తంగిరాల లక్ష్మీనారాయణ (సికిందరాబాదు)

# అంతర్యాలూ, అనుబంధాలూ

(12వ పేజీ తరువాయి)

చదివినంతవరకు చాలును. పెళ్ళి చేసేయండి—అంటున్నది. మా అన్నయ్యేమో—చదువుకో నీయండి. తొందరేమొచ్చింది—అంటున్నాడు. మా నాన్నగారేమో నా ఇష్టమంటారు."

"మరి నువ్వేమంటున్నావ్?"

"నే నెటూ తేల్చుకోలేకుండా ఉన్నాను."

"నేనో మంచి సంబంధం చెప్తాను. చేసుకుంటావా మరి?"

రాధ మాట్లాడలేదు. తను చెప్పబోయే సంబంధ మేదో తెలుసుకుంది.

"రాధా! నువ్వేమయినా అనుకో! నిన్ను చూసిన క్షణంనుంచీ నా మనసు నిండా నీవే. ఆ భగవంతుని దయవల్ల మనిద్దరికీ స్నేహం కలిగింది. కాని ఈ స్నేహం స్నేహంగా ఉండి పోవటం ఇష్టంలేదు. సంబంధం కలుపుకోవాలని నా మనసు ఉవ్విళ్ళూరుతున్నది. మా అన్నయ్యను చూస్తున్నావుగా—ఏమిటి నీ ఉద్దేశ్యం?"

రాధ సిగ్గుల పెళ్ళికూతురయింది.

"నాతో చెప్పటానికి సిగ్గెందుకు రాధా!"

"నా ఉద్దేశ్యంతో నిమిత్త మేముంది? ముందు మీ అన్నయ్య."...

"మా అన్నయ్య ఒప్పుకుంటాడు రాధా!" అని తను అన్నదే కాని అన్నయ్యను ఒప్పించ గలనా అని లోలోపల అనుమానంగానే ఉంది.

"పెద్దలు ఒప్పుకోవాలిగా..."

"మావాళ్ళు ఎటువంటి అభ్యంతరం చెప్పరు రాధా! మీ వాళ్ళను ఒప్పించే బాధ్యత నీది. మా అన్నయ్యను నేను 'అవు'ననిపిస్తాను."

"నీ ఇష్టం సంధ్యా!"

తనకు తెలియకుండానే కళ్ళు అశ్రుసిక్తాలయాయి. ఆనంద బాష్పాలంటే ఇవే కాబోలు!

"అయితే రాధా! నీ మద్రాసు ప్రయాణం వాయిదా వేయాలి."

"సంధ్యాదేవిగారు ఆర్డరు వేస్తే దానికి తిరుగు ఉంటుందా?"

"ఆర్డరు కాదు రాధా! ఇది అభ్యర్థన!"

అంతలోకే అన్నయ్య టెన్నీసు రాకెట్ ఊపుకుంటూ ఇంట్లోకి వచ్చాడు. రాధ సిగ్గుల పెళ్ళికూతురయింది. అన్నయ్యను క్రీగంట చూస్తోంది.

"రాధా! మరీ అంత వాలుచూపులు ఒంటికి మంచిది కాదు—వేడి చేస్తుంది" అని మెల్లగా తననేసరికి—రాధ పారిపోయింది—"వస్తా" నంటూ.

అన్నయ్య బట్టలు మార్చుకునేందుకు గది లోకి వెళ్ళిపోయాడు.

రాధ వెళ్ళినవైపే చూస్తూ తను నిల్చుండి పోయింది.

"అదేమిటే — అలా నిలబడిపోయావ్!" అమ్మవచ్చి బుజంమీద చేయివేసేదాకా తనకు తెలివి రాలేదు.

"అమ్మా! రాధను అన్నయ్యకు చేసుకుంటే—"

"చేసుకుంటే బాగానే ఉంటుంది. చక్కని పిల్ల. చదువు సంధ్యలు నేర్చినది. మంచి పరువు మర్యాదగల కుటుంబం. కాని అన్నయ్యకు ఏ పిల్లా నచ్చదుగా —" అమ్మ అధైర్యంగా మాట్లాడేసరికి తనకూ భయమే కలిగింది.

అన్నయ్య వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

సీలింగ్ ఫేన్ తిప్పి మంచినీళ్ళు ఇస్తూ—

"అన్నయ్యా! నీకో చక్కనిపిల్లను చూశాను"—అన్నది.

మంచినీళ్ళు తాగుతూ—కళ్ళతో నవ్వాడు.

"అబద్ధం కాదన్నయ్యా!"

"అమ్మ ఇప్పటికి పదిహేనుమంది మంచి చక్కని పిల్లల్ని చూపించింది" అన్నాడు—'చక్కని' అనే మాట దగ్గర నొక్కుతూ.

"నీకు నచ్చలేదు గాని—వాళ్ళు చక్కని పిల్లలు కాకపోలేదు!" అమ్మ ఎప్పుడు వచ్చిందో తనను తను సమర్థించుకుంది.

"ఈ అమ్మాయి నీకు తప్పక నచ్చుతుం దన్నయ్యా!"

"ఇంతకూ ఆ అమ్మాయి ఎవరూ? ఏమిటీ?"

"ఇప్పటిదాకా ఆ అమ్మాయికీ నాకూ స్నేహమే. ఇక సంబంధం కూడా కలుపుకోవాలి."

"సంబంధం కలుపుకుందామని ఎంతమంది అనుకొని మన దగ్గరకు రాలేదు? కాని ఏదీ వీడు కలవనిస్తేగా?" అమ్మ నిష్ఠూరంగామూ, నిరాశగానూ మాట్లాడి వంటింట్లోకి వెళ్ళి పోయింది.

"నేను కలవనిచ్చే దేముంది? ఆ ఘడియ వస్తే అదే కలుస్తుంది."

"అదే నన్నయ్యా! నేననేది—ఆ ఘడియ దగ్గరలోకే వచ్చింది."

"ఇంతకీ ఎవరా స్నేహితురాలు?"

"ఎవరో కాదన్నయ్యా! రాధ!"

"రాధా! అయితే అమ్మే కాదు, నీవూ ఫెయిలయినావు ఈ ప్రయత్నంలో."

అన్నయ్య సమాధానానికి తన గుండెలు నీరు కారిపోయాయి. తన ఆత్మీయులనుంచి అదృశ్య హస్తాలు తనను ఎక్కడికో విసిరి వేస్తున్నాయి.

"అన్నయ్యా!"

శిఖరారోహణలో కాలుజారి క్రిందపడుతున్న ప్రాణి ఆక్రోశమే అయింది తన పిలుపు.

"అమ్మడూ! నువ్వు చిన్నదానివి. నీకు తెలియదు. ఈ విషయంలో నన్ను బలవంతం చేయకు."

"అన్నయ్యా! నేను చిన్నదాన్నే. ఒప్పుకుంటాను. కాని ఈ ఒక్క విషయంలో నా మాట కాదనకు. నా కోరిక తీర్చన్నయ్యా! నేనీ జన్మలో ఇక వేరే నిన్ను కోరే దేమీ లేదన్నయ్యా!"

"అమ్మడూ! ఇది నీ కోరికగా భావించు

కోకు. నా జీవిత సమస్య అన్నట్లుగా చూడు. వివాహమంటే ఒక గంట, ఒక రోజు విషయం కాదు; ఇష్టంలేని సినిమాకు పోవటం కాదు; నచ్చని గుడ్డ కొనుక్కోవటం కాదు; యావజ్జీవితం అనుభవించాల్సింది వివాహం తాలూకు ఫలితం.''

''నేను ఆలోచనలేక చెప్పటం లేదన్నయ్యా! రాధ అంతరంగం విలువ నీకు తెలియదు. సహృదయురాలు, సరసురాలు, చదువుల సర

## అంతర్యాలూ, అనుబంధాలూ

స్వతి. అన్నింటినీ మించి వెన్నవంటి మనసు; పాల కడలివంటి హృదయం. అలాంటి రాధ తోటి స్నేహం స్నేహంగా ఉండిపోవటం నా









కిష్టంలేదు. సంబంధం కలుపుకోవాలని నా మనసు సంబరపడుతూంది. వదినగా రాధ మనింటికి రావాలని నా హృదయం వాంఛిస్తూంది. రాధ ముమ్మూర్తులా నీ ఊహాసుందరిలాగా ఉండకపోవచ్చు. అయినా నీకు తగిన పిల్ల. నీవు చెప్పినట్లు నడుచుకుంటుంది. నీ కనుసన్నల్లో మెలుగుతుంది. మనింటికి రాతగిన కోడలు.''

''రాధ ఒప్పుకున్నదా?''

''రాధేకాదు—అమ్మ కూడా ఒప్పుకుంది.''

''అయితే నన్ను ఆలోచించుకోనీయి. తొందరపడి మాట ఈయకు.''

రాధ వాళ్ళమ్మ కూడా ఎంతో సంతోషించింది. వాళ్ళ నాన్నగారూ ఒప్పుకొన్నారు. రాధ తను ఇంటికి రావటానికే సిగ్గు పడుతూంది. అన్నయ్య కన్పిస్తే చాలు తల ఎత్తదు. తను వెయ్యి దేవుళ్ళకు మొక్కుకొంది—అన్నయ్యచేత అవు ననిపించమని.

మర్నాడు సాయంత్రం టెన్నీసుకు పోబోతున్నాడు.

''అన్నయ్యా! ఏమంటావ్?''

''ఏమోను అమ్మడూ! నా మనసుకు నేను నచ్చ చెప్పుకోలేకపోతున్నాను.

''అదేమిటి అన్నయ్యా! రాధ విషయంలో ఇంతగా ఆలోచించాలా?''

''నా ఊహామూర్తి లభించేదాకా అన్వేషిస్తాను. కాని పరిస్థితులతో రాజీ పడటం ఇష్టం లేదు.''

''ముమ్మూర్తులా నీ ఊహాసుందరి లభించాలంటే జీవితాంతం వెతకాల్సి వస్తుందేమో అన్నయ్యా! ఇప్పటికి ఏడాదినుంచి ఈ అన్వేషణ. సుమారు పదిహేనుమంది పిల్లల్ని చూస్తివి. చూడకుండా పంపినవి ఇరవైదాకా ఉన్నాయి. ఇక పరిస్థితులతో రాజీపడి ఉన్న వాటితో సరిపెట్టుకోపోతే ఎలా అన్నయ్యా!''

''రాధ మనస్ఫూర్తిగా ఇష్టపడుతున్నదా లేక నాలాగా రాజీ పడుతూందా?''

''నీ కా భయ మేమీ వద్దన్నయ్యా! ఆ అమ్మాయి ఇష్టపడటం నీ అదృష్ట మన్నయ్యా. నేను మాట వరుసకు అనటంలేదు. పెళ్ళయాక నీకే తెలుస్తుంది. నేను ఎంతోమంది పిల్లల్ని చూశానుగా. ఇంత వినయ విధేయతలు, తెలివితేటలు, చదువుసంధ్యలు — ఉన్న పిల్లను ఎక్కడా చూడలేదు. నా మాట విని ఒప్పుకో అన్నయ్యా!''

''అలాగే—కానీయి. జీవితంతో లాటరీ వేస్తున్నాను.''

అన్నయ్యే కాదు, రాధ కూడా అదృష్టవంతురాలే. పుణ్యంకొద్దీ పురుషు డన్నట్లు ఎలాంటి నోములు నోచుకుందో అన్నయ్యను భర్తగా పొందేందుకు!

కళ్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగ దంటారు.

ఏడాదినుంచీ అన్నయ్య వివాహ ప్రయత్నం. ఆ ఘడియ వచ్చేసరికి—

తనకు ఈ సంకల్పం కలగటం, ఉభయులూ ఒప్పుకొనటం లగ్నం పెట్టుకోవటం, వివాహం జరగటం—త్వరత్వరగా జరిగిపోయాయి.

వివాహమయిన మూడో రోజు మూడు నిద్రలకు రాధను తమ ఇంటికి తీసుకుని వచ్చిన తర్వాత—మధ్యాహ్నంవేళ అందరూ నిద్రపోతుంటే తను మధ్య హాల్లో పడుకుని పత్రిక చదువుకుంటూంది.

అన్నయ్య తనను పిలిచి—

"అమ్మడూ! నీకు బహుమతి ఏమి కావాలో కోరుకో" మన్నాడు.

"బహుమతా? ఎందుకన్నయ్యా?" తన కర్థంకాలేదు.

"రాధను భార్యగా పొందగలగటం నిజంగా నా అదృష్టం అమ్మడూ! నువ్వు గట్టిగా పట్టుపట్టి చెప్పకపోయినట్లయితే రాధను పోగొట్టుకునేవాణ్ణే."

"అలాంటి భావన కలగటం రాధ అదృష్టం అన్నయ్యా!"

"అంతేకాదు అమ్మడూ! ఒక జీవిత సత్యం కూడా నేర్చుకున్నాను. చిన్నప్పటినుంచీ పెంచి పెద్దచేసిన తల్లితండ్రులనూ, తోబుట్టువులనూ వదిలి కష్టసుఖాల్లో భాగం పంచుకునేందుకు అత్తవారింటికి రావటమే కాకతన సర్వస్వం భర్తకు సమర్పించుకునే త్యాగమయి భర్త హృదయంలో సుస్థిర స్థానమే సంపాదించుకుంటుంది. అలాంటి త్యాగంతో సహృదయత, సచ్ఛీలం కూడా జోడిస్తే భర్తనే జయించకలదు భార్య. రాధ నిజంగా నన్ను జయించింది—అమ్మడూ. అందుకే నీకు బహుమతి. కోరుకో ఏంకావాలో!"

నాలుగువందల రూపాయలు పెట్టి కొని రిస్ట్‌వాచీ బహుమతి ఇచ్చిన అన్నయ్యా—

"నీ ఋణం ఎలా తీర్చుకుంటానో" అన్న వదినా—

ఒక్కసారి మారిపోయారు.

తనను పిలవకుండానే ఇద్దరూ సినిమాకు పోయారు.

తనుచేసిన తప్పేమిటి?

తనుచేసిన ద్రోహ మేమిటి?

తన హృదయం సమాధానం తెలియని ప్రశ్నతో దహించుకుపోతూంది.

తన మనసు పరిష్కారమెరుగని సమస్యతో సతమతమయిపోతూంది.

*　　　*　　　*　　　*

భర్త మూర్తితో మేడమెట్లు దిగిన సంధ్య అప్రయత్నంగా తలెత్తి పైకి చూసింది.

బాల్కనీలో ఒంటరిగా కరుణ నిల్చుని ఉంది!



ఎదురొచ్చే దెవరు? ఫోటో—బ్రహ్మ దేవ్ (డేరాడూన్)

నెలరోజులక్రితం ప్రకాశం అన్నయ్యా, రాధ వదినా తనను సినిమాకు తీసుకవెళ్ళకుండా వెళ్ళిన సాయంత్రం తన హృదయమనుభవించిన ఆరాటం ఆడపడుచు కరుణ కళ్ళలో కొట్టవచ్చినట్లు కన్పిస్తూంది.

ఈ నెల రోజులనుంచీ తనను నీడలా వెన్నంటుతూన్న సమస్య—వివాహమయ్యాక అన్నయ్యా, రాధా ఎందుకు మారిపోయారన్న ప్రశ్నకు సమాధానం ఆడపడుచు కరుణ కళ్ళలో దొరికేసరికి సంధ్య సిగ్గుబడిపోయింది.

అలౌకికమయిన ఆకర్షణానురాగాలబంధనలో నూతన దంపతులు ఊహాలోకంలో విహరిస్తూ ఉంటారు. ఆ అపూర్వానందానుభవసమయాల్లో ఇతర స్నేహ సంబంధాలు కొంచెం సడలటం సహజం. ఈ సహజ గుణం ఎరుగని తను అన్నయ్యనూ రాధనూ అపార్థం చేసుకుంది. మారిపోయారని ఆవేదన చెందింది.

నెల రోజులనాటి తన లాగానే ఈరోజున కరుణ ఆరాటం చెందుతూంది. ఆకన్నె హృదయం ఆవేదన అనుభవిస్తూంది.

భర్త మూర్తిని నిమిషం ఆగమని సంధ్య గబగబా మేడమెట్లు ఎక్కి పైకి వచ్చింది.

"కరుణా! ఇదేమిటే—నీవు వస్తున్నావు అనుకున్నాను. ఇంకా ఇక్కడే నిల్చున్నావేం? బయల్దేరు."

నీలికళ్ళలో సుడులు తిరుగుతూన్న నీళ్ళను దాచుకునే ప్రయత్నంలో విఫలమైన కరుణ—"నువ్వుగాని అన్నయ్యగాని రమ్మననిదే ఎలావచ్చేది వదినా!" అని అంటూంటే సంధ్య బరువెక్కిన గుండెలను చేత్తోపట్టుకుంది. అయినా ఆమెకు దుఃఖం ఆగిందికాదు. ఆమాయకహృదయం ఎంత ఆవేదన దాచుకుంది! తనకన్నా వేయిరెట్లు బాధ పడుతూంది. లేని నవ్వు తెచ్చిపెట్టుకొని—సంధ్య—

"ఓసి పిచ్చిదానా, మేము రమ్మనాల్నా నువ్వు వస్తే కాదంటామా?"

"అయితే నిజంగా రమ్మంటావా వదినా!"

కరుణ తడికళ్ళు తళతళా మెరిశాయి.

"తొందరగా బయల్దేరు. మీ అన్నయ్య రోడ్డుమీద నిల్చున్నారు మనకోసం." కరుణ చూడకుండా కంటికొనన వ్రేలాడుతూన్న నీటి బిందువులను గోటితో తుడిచివేసుకుంది సంధ్య.

కరుణా, సంధ్యా మేడమెట్లు దిగుతూంటే మూర్తి అర్థంకాక వారిద్దరివంకా చూస్తూ నిల్చున్నాడు. ఒక్క నిమిషంలో వస్తానని మేడమీదికి పోయింది సంధ్య—కరుణను కూడా తీసురావటానికా? ముందుగానే రమ్మని వేళకు పిలవటం మరిచిపోయిందా? లేక ఇప్పుడు మేడదిగి రోడ్డుమీదకు వచ్చాక గుర్తు వచ్చిందా—అర్థం కావటంలేదు మూర్తికి.

"తలనొప్పి, దరిద్రములాగా కన్నె హృదయవుటావేదన స్వానుభవంలోకి వస్తేకాని తెలియదులే" అని మనసులో అనుకున్న సంధ్య మూర్తి వంక చూసి సన్నగా నవ్వింది. ఆనవ్వులో ఛాయామాత్రంగా ఒక జీవిత సత్యం సుడి తిరిగింది! ★